## అనుమానాస్పద స్థితిలో డాక్టర్ మృతి

**కీసర, జులై 25, ప్రభాతవార్త:**

అనుమానాస్పదంలో డాక్టర్ మృతిచెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కీసర సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాలప్రకారం, యాదాద్రి జిల్లా భువనగిరిమండలం మైలారం గ్రామానికి చెందిన అనంతచారి తనభార్య అరుణ, పిల్లలతో కలిసి నాగారం వెస్ట్గాంధీనగర్ కాలనీలో భవానీ ప్యారడైజ్ అపార్ట్మెంట్ 5వఅంతస్తులో నివాసం ఉంటున్నారు. ఆయనకూతురు దీక్షిత(28) ఎంబిబిఎస్ పూర్తిచేసి ఆరునెలల క్రితం పైచదువుల కోసం కర్నాటక అగలపోటలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో చేరి పిజి ప్రథమ సంవత్సరం చదువుతూ అదే ఆస్పత్రిలో పనిచేస్తుంది. రెండు మూడు నెలలుగా కళాశాలలో సెలవులు కావాలని అడగగా ఇవ్వకుండా పనిచేయించడంతో దీక్షిత తీవ్ర ఒత్తిడికి తాళలేక ఈ నెల 17న ఇంటికి వచ్చింది. 5అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. రక్తపు మడుగులో పడిన ఆమెను కుటుంబసభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న విజయహస్పిటల్కి తీసుకెళ్లారు. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కాగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆత్మహత్యకుగల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఒత్తిడివల్ల ఆత్మహత్యచేసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

**శంషాబాద్, జులై 25, ప్రభాతవార్త:**

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదనపల్లి పాత తండా సమీపంలోని ఎన్హెచ్-44 రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. సిఐ సురేందర్రెడ్డి వివరాల ప్రకారం, శంషాబాద్నుండి షాద్నగర్వెళ్లే మార్గంలో మదనపల్లి పాతతండా యూటర్న్ సమీపంలో ఓవ్యక్తి రోడ్డుప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం అందడంతో పోలీసుసిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మొబైల్ ఫోన్కు వచ్చిన కాల్ ద్వారా మృతుడు అస్సాంకు చెందిన అర్జున్భూమిజ్(31)గా గుర్తించారు. అతను ఐదురోజులక్రితం పనినిమిత్తం అస్సాంనుండి జడ్చర్లకు బయలుదేరినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సుమారు 05:30 గంటలకు మదనపల్లి పాతతండా యూటర్న్ సమీపంలో ఎన్హెచ్-44 రహదారిని దాటుతుండగా శంషాబాద్వైపు నుండి షాద్నగర్వైపు వేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం అతనిని ఢీకొట్టి, వాహనాన్ని ఆపకుండా అక్కడినుండి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో అర్జున్ భూమిజ్కు తల, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలై అధికరక్తస్రావంకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## దారి అడిగి మరీ దౌర్జన్యం..

**-వృద్ధురాలి మెడలో బంగారుగొలుసు అపహరణ**
**-సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తుచేపట్టిన సిఐ నరహరి**

**కేశంపేట, జులై 25, ప్రభాతవార్త:**



బైక్పై ప్రయాణిస్తున్న దొంగలు

దారి అడిగే నెపంతో వచ్చి ఒక వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లిన సంఘటన కేశంపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు చాకలి సోమరాజు బాలమ్మ కథనం ప్రకారం.. సంతపూర్గ్రామానికి చెందిన ఆమె కూలీడబ్బులు తెచ్చుకునేందుకు తన మనవరాలు భవానితోకలిసి శనివారం ఉదయం దాదాపు 11గంటల సమయంలో నడుచుకుంటూ సంతాపూర్గ్రామ సమీపంలోని ఎస్సీకాలనీకి వెళ్తుండగా, శ్మశానవాటిక సమీపంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, నంబర్ప్లేట్ లేని బైక్పై వచ్చి కొల్లాపూర్కు దారెటు అని అడిగారు. ఆమె దారిచెబుతుండగానే క్షణాల్లో ఆమెమెడలోని బంగారాన్ని తెంపుకొని మక్త మాదారం వైపు బైక్పై వేగంగా పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేశంపేట సిఐ నరహరి కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

## దౌల్తాబాద్ పెద్దచెరువులో మొసలి కలకలం..

**-గ్రామస్థులకు అటవీశాఖ అధికారుల హెచ్చరిక**



మాట్లాడుతున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఖజాఫరూక్అలీ

**దౌల్తాబాద్, జులై 25, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మొసలి సంచరిస్తున్నదన్న సమాచారంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఖజాఫరూక్అలీ ఆధ్వర్యంలో రెస్క్యూ బృందం శనివారం సందర్శించి పెద్ద చెరువును క్షుణ్ణంగా పరిశీలించింది.ఈ సంధర్భంగా గ్రామ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువు వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు.ముఖ్యంగా చిన్నపిల్లలను చెరువు పరిసర ప్రాంతాలకు అసలు వెల్లనివ్వవద్దని సూచించారు.ప్రాణాపాయం జరిగే అవకాశం ఉన్నందున,తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎవరూ చేపల వేట,ఈత కొట్టడం వంటి ఇతర కార్యకలాపాలకు వెళ్లకుండా తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బందితో పాటు గ్రమసర్పంచ్ బి.శ్రీనివాస్రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాలిక మృతిపై స్కూల్ యాజమాన్యంపై తీవ్ర ఆరోపణలు

**-చిన్నారి ప్రాణానికి రూ.6లక్షలు ఖరీదు కట్టారంటూ విమర్శలు**
**-పాఠశాల అనుమతులు, బస్సుల ఫిట్నెస్పై సమగ్ర విచారణకు డిమాండ్**

**షాద్నగర్, జులై 25, ప్రభాతవార్త:**

పాఠశాలకు వెళ్లిన నాలుగేళ్లచిన్నారి తిరిగి క్షేమంగా ఇంటికి వస్తుందని ఆశించిన తల్లిదండ్రులకు విషాదం మిగిలింది. స్కూల్ బస్సు కిందపడి యుకెజి విద్యార్థిని మృతిచెందిన ఘటన చౌదర్ గూడ మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈఘటనపై ఓపాఠశాల యాజమాన్యంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారి మృతిఘటనను కేవలం పరిహారంతో ముగించ కుండా, ప్రమాదానికి అసలు కారణాలను వెలికితీసి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు, విద్యార్థిసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**రూ.6 లక్షల పరిహారంపై ఆరోపణలు..?**

చిన్నారిమృతి అనంతరం కుటుంబానికి పరిహారం అందించే విషయంలో కొందరు నాయకుల సమక్షంలో చర్చలు జరిగాయని, రూ.6లక్షల పరిహారంపై ఒప్పందం కుదిరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై అధికారిక ధ్రువీకరణ లేదు. చిన్నారిప్రాణానికి పరిహారం కట్టడం కంటె ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై ప్రశ్నించాల్సిన కొందరు ప్రతిపక్ష నాయకులు పాఠశాల యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. 6లక్షల పరిహారం మాట్లాడి ఒకలక్ష అడ్వాన్స్ ఇస్తామని నెల తర్వాత మరో ఐదులక్షలు ఇస్తామని ఒప్పందం చేయాలని ఒత్తిడితెస్తున్నట్లు సమాచారం.

**పాఠశాల బస్సుల ఫిట్నెస్పై ప్రశ్నలు...**

పాఠశాల బస్సుల ఫిట్నెస్, ఇన్సూరెన్స్, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్న అన్ని వాహనాలను రవాణాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీచేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. డ్రైవర్ల అర్హతలు, వాహనాల భద్రతా ప్రమాణాలను కూడా పరిశీలించాలని కోరుతున్నారు.

**గతంలోనూ విద్యార్థులకు సంబంధించిన ఘటనలపై ఆరోపణలు...**

ఇదే పాఠశాలలో గతంలో విద్యార్థులకు సంబంధించిన కొన్ని ఘటనలు చోటుచేసుకున్నాయని కొందరు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గాలిగూడకు చెందిన ఓ విద్యార్థినికి సంబంధించిన చెవిపోగుల ఘటనలోనూ యాజమాన్యం మొదట తమకు ఏమీతెలియదని చెప్పి, అనంతరం పోలీస్ స్టేషన్లో చర్చలుజరిపిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆతర్వాత విద్యార్థిని కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేశారని వారు పేర్కొంటున్నారు. అలాగే ఓ విద్యార్థిని వీపుపై స్కేల్తో కొట్టిన ఘటనపై తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా, తమను అవమానించేలా మాట్లాడారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై పాఠశాల యాజమాన్యం నుంచి ఆధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

**బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి...**

ఈ ఘటనపై ఇప్పటికే ఎబివిపి ఆధ్వర్యంలో పాఠశాల ముందు ఆందోళన నిర్వహించి, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైనచర్యలు తీసుకోవాలని, మృతిచెందిన చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఆందోళన చేస్తున్న ఎబివిపి నాయకులను పోలీసులు అరెస్ట్చేసి స్టేషన్కు తరలించిన విషయం తెలిసిందే. చిన్నారిమృతి ఘటనను కేవలం పరిహారం చెల్లింపుతో ముగించకుండా, ప్రమాదానికి దారితీసిన ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

## బిజెవైఎం జిల్లా అధ్యక్షుడిని అభినందించిన ఎంపి



ఎంపి ఈటల చేతులమీదుగా సన్మానం అందుకుంటున్న అర్జున్

**మేడ్చల్, జులై 25, ప్రభాతవార్త:**

బిజెవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడుగా ఇటీవల ఎన్నికైన రాగం అర్జున్ను మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ అభినందించారు. శనివారం ఎంపి నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లి కలిసిన అర్జున్ను శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఎంపి మాట్లాడుతూ, యువతలో సేవాభావం పెంపొందించడంతో పాటు బిజెపి సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేవిధంగా పని చేయాలని సూచించారు. మేడ్చల్ జిల్లాలో యువతను సమన్వయంచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. కాగా తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి అర్జున్ ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైద్యులు అందుబాటులో ఉండాలి

**-శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్కుమార్**




సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్కుమార్

**వికారాబాద్, జులై 25, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశమందిరంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, ఒక్కో మెడికల్ విద్యార్థి విద్యకోసం రాష్ట్రప్రభుత్వం రూ.70లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వనియామకాల వల్ల ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం జరిగిందని, ఇంతచేసిన ప్రభుత్వానికి మంచిపేరు రావాలంటే వైద్య అధికారులు అంకితభావంతో పనిచేయాలని సభాపతి తెలిపారు. విభాగాల అధిపతులు హైదరాబాద్ నుండి రోజు వచ్చి పోవడం కాకుండా స్థానికంగా ఉంటే, ఎక్కువసమయం వైద్యసేవలు అందించవచ్చని ఆయన అన్నారు. మెడికల్ కాలేజీ అందుబాటులో ఉందని, కాలేజీ అధ్యాపకులతో పాటుగా హాస్పిటల్ హెచ్ఓడిలు కూడా వారి అనుభవాలను విద్యార్థులకు నేర్పాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధికంగా ప్రాముఖ్యత ఇస్తుందని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు అధికంగా వచ్చేది పేదలు మాత్రమేనని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. వికారాబాద్ చుట్టూ గ్రామాలు ఎక్కువ, ఇక్కడ వైద్యం అందకపోతే హైదరాబాద్ పోవాల్సిన పరిస్థితి ఉంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వం వందలు, వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి బిల్డింగ్లు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు ఇతర వసతులు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఎంత ఖర్చుచేసినా డాక్టర్లు, సిబ్బంది, నాణ్యమైనవైద్యం చేసి రోగులకు నయం జరిగితేనే సర్కారు వైద్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత అయితే మంచిచికిత్స అందించడం వైద్యుల బాధ్యత అని ఆయన తెలిపారు. వికారాబాద్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న వందబెడ్ల వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ను 30కోట్ల రూపాయలతో 330బెడ్లుగా అభివృద్ధిచేయడం జరిగిందని, 50బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా త్వరలోనే అందుబాటులోకి రాబోతుందని ఆయన తెలిపారు. వైద్యవిద్యార్థులు అందుబాటులో ఉంటారు కాబట్టి ఇంకామెరుగైన వైద్యసేవలు అందించవచ్చని ఆయన అన్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ పోకుండా మన ఆసుపత్రిలోనే వైద్యసేవలు అందేవిధంగా చూడాలని వైద్య అధికారులకు సూచించారు. డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు 24గంటలు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని ఆయన సూచించారు.

అంబులెన్స్ ఎప్పుడు కూడా వర్కింగ్ కండిషన్లో ఉంచాలని, సమాచారంరాగానే నిమిషంలో బయల్దేరే విధంగా చూసుకోవాలని ఆయన తెలిపారు. హాస్పిటల్కు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని, రోగులు హాస్పిటల్కు బాధతో రావాలి. తిరిగి వెళ్ళేటప్పుడు నవ్వుతూ వెళ్ళేవిధంగా అందరూ సేవలను అందించాలని ఆయన ఆకాంక్షించారు. చేవెళ్ల పార్లమెంట్సభ్యులు కొండ విశ్వేశ్వర్రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు విశ్వాసంకలిగేవిధంగా వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వాస్పత్రిలో మంచి ఫలితాలు సాధించేదిశగా వైద్యాధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైనసేవలందిస్తూ గౌరవాన్ని సంపాదించుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అంబులెన్స్ అందుబాటులో ఉండడంతోపాటు పరికరాలను కూడా సమకూర్చుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, ఆసుపత్రులకు వచ్చే పేదప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎక్కడ లేనివిధంగా కొడంగల్, వికారాబాద్లలో జిల్లా ఆసుపత్రులు ఉన్నాయని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఆసుపత్రిలో ఏవైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది కొరత ఉంటే కారుణ్య నియామకాల ద్వారా ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించేందుకు చర్యలుతీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సుధాకర్ లాల్ మాట్లాడుతూ, సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మాతాశిశుసంరక్షణ సేవలు అందిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో 100శాతం ప్రసవాలు చేపడుతూ, నవజాత శిశువుల మరణాలు తగ్గేవిధంగా చర్యలుతీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ప్రసాద్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.సుబోధ్కుమార్, డిసిహెచ్ఓ కోఆర్డినేటర్ డాక్టర్ టి.ఆనంద్, ఐఎంఎ జిల్లా డాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ మధుసూదన్రెడ్డి, రెడ్క్రాస్ జిల్లా కార్యదర్శి టి.సాయిచౌదరి, వివిధ విభాగాల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై పోరాటానికి బిజెపి శ్రీకారం

**-మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్**
**-ఫీజు బకాయి-బిజెపి లడాయి కార్యక్రమ వాల్పోస్టర్ ఆవిష్కరణ**



వాల్పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

**మేడ్చల్, జులై 25, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేదంటే బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతంచేస్తామని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హెచ్చరించారు. తెలంగాణ బిజెపి రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన ఫీజు బకాయి-బిజెపి లడాయి రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా శనివారం నిర్వహించిన వాల్పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం సుమారు 40 లక్షలమంది విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15 వేలకోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదలచేయకుండా వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు అందకపోవడంతో అనేక కళాశాలలు విద్యార్థుల అసలు విద్యార్హత సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోయి వేలాదిమంది యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిరుద్యోగ యువత సంఖ్యపెరగడానికి కాంగ్రెస్ప్రభుత్వ వైఫల్యాలే కారణమని ఆరోపించారు. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు బిజెపి తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. ఫీజు బకాయి-బిజెపి లడాయి ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి జిల్లా ఇన్చార్జ్ విక్రంరెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్, కార్యక్రమకన్వీనర్, జిల్లామీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్రావు, మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కంజుల సుగుణారెడ్డి, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి వరప్రసాద్రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి పవన్రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు చిత్తరంజన్రెడ్డి, నాయకులు అనిల్రెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, విక్రమ్సింగ్, మధుసూదన్గౌడ్, శివసాయిగౌడ్, నరేందర్రెడ్డి, శరత్, గణేష్, ప్రణయ్, మధు, పవన్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్లో పిచ్చికుక్క స్వైర విహారం

**-14మందికి తీవ్ర గాయాలు**
**-ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు**

**కొడంగల్, జులై 25, ప్రభాతవార్త:**

కొడంగల్ పట్టణంలో శనివారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో ప్రజలు తీవ్రభయాందోళనలకు గురయ్యారు. ఉదయంనుంచి పట్టణంలోని పలుప్రాంతాల్లో సంచరిస్తూ ఎదురుగా కనిపించిన వారిపై విచక్షణారహితంగా జరిపిన కుక్క దాడిలో మహిళలు, వృద్ధులు, యువకులతోసహా పలువురు తీవ్రంగా గాయపడిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. స్థానికుల కథనం మేరకు, శనివారం ఉదయం ఒక్కసారిగా పిచ్చికుక్క అత్యంత ఉగ్రరూపం దాల్చి రోడ్డుపై వెళ్తున్నవారిపై దాడులు ప్రారంభించింది. ఎవరినిపడితే వారినే వెంబడించి కరవడంతో ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారు. కొందరు ఇళ్ళలోకి పరుగెత్తి ప్రాణాలు దక్కించుకోగా మరికొందరు తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. పిచ్చికుక్క దాడులు జరిగిన ప్రాంతాల్లో కొంతసేపు భయానకవాతావరణం నెలకొంది. 14మంది పిచ్చికుక్కకాటుకు గురైనట్లు తెలుస్తుంది. కొందరికి చేతులు, కాళ్ళు, మరికొందరికి శరీరంలోని ఇతర భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో వెంటనే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలావుండగా ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులకు సరైనవైద్యం అందలేదని పలువురు ఆరోపిస్తున్నారు. చికిత్స అందించాల్సిన వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాధితులు బంధువులు స్థానికులు వైద్య సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. చివరకు బాధితులకు చికిత్స అందించారు. కాగా చికిత్సకూడా తూతూమంత్రంగానే జరిగిందని, అవసరమైన స్థాయిలో పరీక్షలు, వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకోలేదని బాధితకుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. యాంటిరెబీస్, ఇమ్యూనోగ్లోబ్యులిన్ తదితర అత్యవసర చికిత్సలు తగినవిధంగా అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశంపై కూడా ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈఘటనతో కొడంగల్పట్టణప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పిల్లలను బయటకు పంపేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేస్తుండగా వృద్ధులు, మహిళలు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారు. ఘనటపై స్థానికులు మున్సిపల్శాఖ అధికారులకు ఫిర్యాదుచేయడంతో అధికారులు వెంటనే స్పందించారు. పిచ్చికుక్కను పట్టుకునేందుకు ప్రత్యేకబృందాలను ఏర్పాటుచేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో గాలింపుచర్యలు చేపట్టారు. ఈ విషయమై కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రవీంద్రయాదవ్ మాట్లాడుతూ కుక్కకాటుకు గురైన బాధితులకు ప్రభుత్వ ఆసుపత్రిలో టిటి ఇంజక్షన్తో పాటు యాంటిరెబీస్ వ్యాక్సిన్ వేయడం జరిగిందని, ఇమ్యూనోగ్లోబ్యులిన్ వాక్సిన్ తాండూర్ జిల్లా ఆసుపత్రిలో అందుబాటులో ఉండడంతో అక్కడికి పంపించడం జరిగిందని, త్వరలోనే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలోకూడా అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు.

**కుక్క దాడిలో 14 మందికి తీవ్ర గాయాలు...**

స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్చౌరస్తా మీదుగా కోస్గి రోడ్డు మార్గంలో కుక్క దారినపోయేవారిని వెంబడించి కరిచింది. వైద్యశాఖాధికారులు స్పందించి ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## విఠలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**శంకర్పల్లి, జులై 25, ప్రభాతవార్త:**

తొలి ఏకాదశి సందర్భంగా శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని విఠలేశ్వరస్వామి ఆలయంలో పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ఛైర్పర్సన్ శ్వేతాపాండురంగారెడ్డి దంపతులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజా కార్యక్రమాలు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు కొనసాగాయి.

## పురుగుల మందు తాగి ఓ యువకుడు మృతి

**కోట్పల్లి, జులై 25, ప్రభాతవార్త:**

వివాహం అయి 8సంవత్సరాలు అయినా పిల్లలు కాలేదని మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా కోట్పల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని రాంపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన మాదారం కృష్ణ, తండ్రి అనంతయ్య, వయస్సు 35. 8సంవత్సరాల క్రితం వివాహం అయింది. కాని పిల్లలు పుట్టకపోవడంతో కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై శనివారం ఉదయం పది గంటల ప్రాంతంలో తన సొంతపొలంలో పత్తిపంటకు మందు కొట్టడానికి వెళ్ళి మద్యంమత్తులో పత్తిపంటకు కొట్టే పురుగుల మందు సేవించాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్సనిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందాడు. మృతునిభార్య మాదారం గంగోత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని, దర్యాప్తుచేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించిన్నట్లు ఎస్సై శైలజ పేర్కొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువతి మృతి

**కొత్తూరు, జులై 25, ప్రభాతవార్త:**



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొత్తూరుపరిధిలో శనివారం బైక్పై వెళ్తుండగా వెనుకనుంచి ఆర్టీసీబస్సు ఢీకొట్టడంతో యువతి మృతిచెందగా, యువకుడికి గాయాలు అయ్యాయి. పోలీసుల వివరాలప్రకారం.. రాజేంద్రనగర్లోని శాస్త్రీపురానికి చెందిన ఖైరా ఉన్నిసా కుమార్తె సానియాబేగం(20) ప్రైవేట్ టీచర్గా పనిచేస్తోంది. సానియాబేగానికి ఫలకనుమాకు చెందిన మహమ్మద్ మునీర్ (24)తో రెండునెలల క్రితం నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. శనివారం ఉదయం సానియాబేగం, మహమ్మద్ మునీర్ కలిసి జెపిదర్గాకు వెళ్లి తిరిగి బైక్పై ఇంటికి వస్తుండగా, తిమ్మాపూర్ సమీపంలోని హిల్ కంపెనీ వద్ద వెనుకనుంచి వచ్చిన ఆర్టీసీబస్సు వారి బైక్ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో సానియాబేగం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. మునీర్కు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు షాద్నగర్ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సానియాబేగం తలకు తీవ్రరక్తగాయాలు కావడంతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలితల్లి ఖైరా ఉన్నిసా ఇచ్చిన ఫిర్యాదుమేరకు కొత్తూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సుడ్రైవర్పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అక్రమంగా నిర్మించిన 9భవనాలను సీజ్చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



అక్రమ భవనాలను సీజ్ చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు

**ఘట్కేసర్ రూరల్, జులై 25, ప్రభాతవార్త:**

పోచారం డివిజన్లోని నారపల్లి, యంనంపేట్ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన భవంతులను శనివారం టౌన్ప్లానింగ్ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్యన సీజ్ చేశారు. రెండు గ్రామాల్లో కలిపి 9 భవనాలను సీజ్ చేసినట్లు అసిస్టెంట్ సిటీప్లానర్ శ్రీధర్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం, అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం వంటి అక్రమాలకు పాల్పడినందున సీజ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్రమ నిర్మాణాలపై గతంలో నోటీస్లు ఇచ్చినప్పటికీ, సెలవు దినాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని పలుమార్లు కూల్చివేతకు పాల్పడినా, తిరిగి నిర్మించారని తెలిపారు. దీంతో పోలీసుల సహకారంతో అక్రమ భవనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీదేవి, పోచారం ఐటి కారిడార్ పోలీసులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి

**కుల్కచర్ల, జులై 25, ప్రభాతవార్త:**

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లాభిస్తుందని పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి, హిందూ కమిటి సభ్యులు కుల్కచర్ల సర్పంచ్ ఆంజిలయ్య, శ్రీధర్ రెడ్డి, నరసింహరెడ్డి అన్నారు.శనివారం తోలి ఏకాదశి పురస్కరించుకుని కుల్కచర్ల నుండి మైలారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పాదయాత్రగా కుల్కచర్ల మండల ఆయా గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున్న బయాలుదేరారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి హిందువు ఐక్యమత్యంగా ఉండాలనిహిదూ పండగలను వైభవంగా జరుపుకోని,కట్టు,బోట్టు హైందవ శ్రీఅలంకరణ గొప్పతనాన్ని భావితరాలకు తల్లులు తెలియపరచాలని,ప్రతి హిందూ గర్వంగా హిందూవులంతా ఐక్యమత్యంతో ఉంటే మన భారతదేశానిఏ ఒక్కరు ఏమి చేయలేరని అన్నారు. కార్యక్రమంలో హిందూకమిటి తదితరులు సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా.. ప్రజాస్వామ్య విజయం...

**–వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ ప్రధానకార్యదర్శి వారాల సిరాజొద్దీన్**

**మోమిన్‌పేట్, జులై 25, ప్రభాతవార్త:**

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ వలన వందలాది మంది విధ్యార్థుల ప్రాణాలు పోవడం జరిగిందని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యధర్శి వారాల సిరాజొద్దీన్ పేర్కొన్నారు. ఈ సంధర్భంగా శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతు....కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజినామా కోరుతూ దేశం మొత్తంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతుండడంతో దిగివచ్చిన కేంధ్ర ప్రభుత్వం కేంధ్ర మంత్రిచే రాజీనామా చేయించడం యావత్ దేశ విధ్యార్థుల విజయం, కానీ ధోషులకు అతిత్వరలో తగిన శిక్ష విధించే విదంగా కేంధ్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, మరియు దేశం మొత్తంలో ఈ ఉధ్యమం సంధర్భంగా నమోదైన కేసులను కూడా రద్దు చేయాలని కాంగ్రేస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపికి ఖచ్చితంగా గడ్డు కాలం ఉంటుందని 2029, ఎన్నికల్లో కేంద్రంలో రాబోయేది కాంగ్రేస్ పార్టీ అని ఈ పరిణామాలాతో తేలిపోయిందని సిరాజొద్దీన్ హితవు పలికారు.

## ప్రతి ఇంటికి ఉచితంగా ఐదుమొక్కల పంపిణీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 25, ప్రభాతవార్త:**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) అర్బన్ ఫారెస్ట్రీ, రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి ఉచితంగా ఐదుమొక్కలపంపిణీ కార్యక్రమం జరిగింది. శనివారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి ప్రాంతంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రతి ఇంటిక ఐదు మొక్కలు (మూడు పండ్ల మొక్కలు, రెండు అలంకరణ, ఔషధ మొక్కలను) పంపిణీ చేశారు. ఈ సందర్భంగ పాల్గొన్న కార్పోరేషన్ చైర్మన్ బండి రమేశ్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని, ఈసంవత్సరం 16కోట్ల మొక్కలునాటాలని లక్ష్యంగా పెట్టుకుని పచ్చదనాన్ని పెంచటానికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టె అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అర్బన్ ఫారెస్ట్రీ డైరక్టర్ రోహితి గోపిడి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వనమహోత్సవ–2026 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. హైదరాబాద్ పరిసరనగర ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచటం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించటం, భూగర్బజలాలను సంరక్షించటం, జీవవైవిద్యాన్నికాపాడాలనే లక్ష్యంతో మహిళలను భాగస్వాములను చేస్తూ ప్రతి ఇంటికి 5మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వాటిని నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మందలపు సాయిబాబు చౌదరి, హెచ్‌ఎండిఏ అసిస్టెంట్ డైరక్టర్ అఫ్ హార్టికల్చర్ చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్‌కౌర్, రమేశ్, రాణి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**–తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసిపి జి.శంకర్‌రాజు**



కార్యక్రమంలో ఎసిపి జి.శంకర్‌రాజు, రిటైర్డ్ భారతవాయుసేన గ్రూప్ కెప్టెన్ డివిఎన్‌రావు, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, జులై 25, ప్రభాతవార్త:**

వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలు పాటించాలని, పిల్లల్లో ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించటంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసిపి జి.శంకర్‌రాజు అన్నారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో గల పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రాంగణంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్‌పై విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దీనిలో భారత వాయుసేన రిటైర్డ్ గ్రూప్ క్యాప్టెన్ డివిఎన్‌రావు ఆయనతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగ పాల్గొన్న తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసిపి జి.శంకర్ రాజు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు రహదారి భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణపై పూర్తిస్థాయి అవగాహన కల్గి ఉండాలన్నారు. విద్యార్థుల, తమ కుటుంబ సభ్యులు స్నేహితుల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్లుగా వ్యవరించాలని ఆయన సూచించారు. అదే విధంగా పాదచారుల భద్రత, జీబ్రాక్రాసింగ్ వినియోగం, లేన్‌క్రమశిక్షణ, వేగనియంత్రణ బాధ్యతాయుతమైన డ్రైవింగ్ వాటి ప్రాముఖ్యతను ఎసిపి జి.శంకర్‌రాజు వివరించారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులు పాఠశాలలోనే కాకుండా సమాజంలో కూడ రహదారి భద్రతపై అవగాహన పెంపొందించటంలో ముందు ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు శామీర్‌పేట పోలీస్‌సబ్ ఇన్స్‌పెక్టర్ సోమిరెడ్డి, పాఠశాల డైరక్టర్ డాక్టర్ కార్తీక్ సంకూరి, హెడ్‌మిసెస్ డాక్టర్ సుచరితరాయ్, యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

**–టిపియుఎస్ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్**




వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న టిపియుఎస్ నాయకులు

**పెద్దేముల్, జులై 25, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయ ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే మహధర్నాను విజయవంతం చేయాలని టిపియుఎస్ మండలఅధ్యక్షులు సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో మహధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తా: అనిల్

**ఘట్‌కేసర్, జులై 25, ప్రభాతవార్త:**

అంకితభావంతో పనిచేస్తూ పార్టీ సిద్దాంతాలను ప్రజలలోకి తీసుకువెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఘట్‌కేసర్ డివిజన్ బిజెవైఎం అధ్యక్షులు సుర్వి అనిల్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, రాష్ట్రకార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా యువమోర్చ అధ్యక్షులు రాగం అర్జున్‌లకు ఈసందర్భంగా అనిల్‌గౌడ్ ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థినులు లక్ష్యసాధనపై దృష్టి సారించాలి

**–కస్తూర్బా బాలికల పాఠశాలలో డిసిపి సిహెచ్.శిరీష అవగాహన**




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ సీహెచ్. శిరీష

**కొత్తూరు, జులై 25, ప్రభాతవార్త:**

విద్యార్థులు తమ లక్ష్య సాధనపై దృష్టి సారించి క్రమశిక్షణతో చదువుకోవాలని, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సీహెచ్. శిరీష సూచించారు. శనివారం ఆమె కొత్తూరు పోలీస్ స్టేషన్‌తో పాటు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థినులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సీహెచ్. శిరీష మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ సేఫ్టీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థినులకు వివరించారు. సోషల్ మీడియాను విద్య, విజ్ఞానంకోసం బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని హితవు పలికారు. వేధింపులు ఎదురైతే మోనం వహించొద్దుఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే మత్తుపదార్థాలు, డ్రగ్స్ వల్ల కలిగే తీవ్ర అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని డీసీపీ సీహెచ్. శిరీష ఆకాంక్షించారు. అనంతరం కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు

## దేశ యువశక్తి సాధించిన ప్రజాస్వామ్య విజయం




కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, జులై 25, ప్రభాతవార్త:**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం దేశ యువశక్తి, విద్యార్థులు సాధించిన ప్రజాస్వామ్య విజయమని శామీర్‌పేట సొసైటీ చైర్మన్,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ డా.రామిడి మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఈసందర్భంగా ఆయనతోపాటు పలువురు నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం దిగిరావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డా.రామిడి మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువత రాజకీయాలకు అతీతంగా తమ భవిషత్‌ను, విద్యా వ్యవస్థలో పారదర్శకతకోసం చేపట్టిన ఉద్యమం చివరకు ఫలితాన్ని ఇచ్చిందన్నారు. పరీక్షల నిర్వాహణలో చోటుచేసుకున్న అవతవకలు, విద్యార్థుల భవిషత్‌పై నెలకొన్న అనిశ్చితికి వ్యతిరేకంగా శాంతియుతంగ సాగిన ప్రజాస్వామ్య పోరాటానికి కేంద్ర ప్రభుత్వం స్పందించి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు లాఠీచార్జీలు, భాష్పవాయు గోళాలు, నిర్భంధాలను ఆశ్రయించినప్పటికీ దేశ యువత ఏ మాత్రం వెనకడుగు వేయకుండా అపారధైర్యంతో తమ పోరాటాన్ని కొనసాగించిందని అన్నారు. దేశయువత సాధించిన ఈవిజయం ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని మరింత బలపరుస్తుందని శాంతియుతంగా ప్రజాస్వామ్య బద్దంగా పోరాడితే మార్పు సాధ్యమేనన్న నమ్మకాన్ని దేశ ప్రజల్లో మరింత పెంపొందిస్తుందని చైర్మన్ ఆర్.మదుకర్‌రెడ్డి ధీమాను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు నాయకులు సతీష్‌రెడ్డి, నందుగౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎరుకల కులాలకు ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలి

**–ఏకలవ్యుడి జయంతి వేడుకల్లో ఎరుకల కులస్తుల డిమాండ్**




కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న నాయకులు

**కొడంగల్, జులై 25, ప్రభాతవార్త:**

ఎస్టీ జాబితాల్లో ఉన్న ఎరుకల కులాలకు రాజకీయంగా ఎదగడానికి ప్రత్యేకంగా రిజర్వేషన్‌లు కేటాయించాలని నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఎరుకల కులాల ముఖ్య నాయకులు డిమాండ్ చేశారు.శనివారం ఏకలవ్యుడి జయంతి సందర్భంగా కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎస్టీ జాబితాలో ఉన్న తాము రాజకీయపరంగా అణిచివేతకు గురవుతున్నామని బంజారాలకు,ఎరుకల కులాలకు ఒకే రిజర్వేషన్‌గా గుర్తించడం బాధాకరమని అన్నారు.ఇద్దరు ఉన్న దగ్గర ఎరుకల కులాలకు రిజర్వేషన్‌లు కేటాయించాలని వారు డిమాండ్‌చేశారు.అలాగే నియోజకవర్గంలో దాదాపుగా 5000 కుటుంబాలు ఉన్నాయని,20 నుంచి 30వేల జనాభా కలిగి ఉన్నామని అన్నారు.ప్రత్యేకంగా నియోజకవర్గ స్థాయిలో ఎరుకల కమ్యూనిటీ హాల్ మంజూరీ చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి బుట్టలు అల్లకం పూర్తిగా అంతరించపోవడంతో ఉపాధిలేక విలవిలలాడుతున్నామని, ప్రభుత్వం నుండి ప్రత్యేకంగా రుణాలు మంజూరీ చేసి ఆదుకోవాలని కోరారు.పందుల పెంపకానికి ప్రత్యేకంగా షెడ్యూల్ మంజూరీ చేయాలని, అభివృద్ధికి సహాయసహకారాలు అందించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఎరుకలకులాలకు ప్రతిమండలంలో ఒక కమ్యూనిటీ హాల్ కేటాయించడంతో పాటు నియోజకవర్గ కేంద్రంలో పెద్ద కమ్యూనిటీహాల్ మంజూరీచేయలని ముఖ్యమంత్రిని కోరారు.అందకుముందు మహదేవుని ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలగా వస్తు నినాదాలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎరుకల కులసుతలు కిష్టప్ప, చంద్రప్ప, శ్రీనివాస్, రమేష్,అంజి, వెంకటరాములు, వెంకటేశ్వర్లు, భీములు, వినోద్, పాండు, బాల్‌రాజ్, శ్రీనివాస్, ఎల్లప్ప, కృష్ణ, నాగరాజు, హనుమప్ప, వెంకటప్ప, బుగ్గప్పలతో పాటు ఆయా మండలాలకు చెందిన దాదాపు వందమంది పాల్గొన్నారు.

## భక్తిశ్రద్దలతో తొలిఏకాదశి పూజలు

**–సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాలు**

**ఘట్‌కేసర్, జులై 25, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్‌సర్కిల్ పరిధిలో శనివారం తొలిఏకాదశి పర్వదినాన్ని భక్తి, శ్రద్దలతో జరుపుకున్నారు. ఆషాడశుక్ల ఏకాదశిని తొలిఏకాదశి (శయన ఏకాదశి)గా పరిగణించి హిందుపండుగలలో మొదటిపర్వదినంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయాలకు వెళ్లి దైవదర్శనాలు చేసుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత రంగమన్నారు స్వామి ఆలయం, వేమనానగర్‌లోని శ్రీవిజయవెంకటేశ్వరస్వామి, ఎన్ఎఫ్‌సీ నగర్ శ్రీవిశ్వేశ్వరగిరి క్షేత్రం వెంకటేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఘట్‌కేసర్, వేమనానగర్, కొండాపూర్, శివారెడ్డిగూడ, ఎన్ఎఫ్‌సీనగర్, ఎదులాబాద్, అవుషాపూర్, అంకుశాపూర్ తదితర గ్రామాల్లో తొలిఏకాదశి పండుగను భక్తితో నిర్వహించారు. భక్తులు ఉపవాసదీక్షలు చేశారు.

## ఫ్యూచర్ సిటీకి బఫర్ జోన్ గుబులు

**యాచారం, జులై 24, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో హైదరాబాదు నడిబొడ్డు నుండి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేడియల్ గ్రామాలన్నీ కోట్లల్లో భూముల ధరలు పెరిగాయని యాచారం మండలానికి రియల్ గ్రహణం పట్టి వెనుకబడిపోయింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల విధానంతో ఫార్మాసిటీ కి బదులుగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం లో భాగంగా సెరవేగంగా ముందుకు సాగుతున్న రియల్ వ్యాపారానికి బఫర్ జోన్ ఆంక్షలు వేయించే అవకాశం ఉందని రియల్ వ్యాపారంలో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంటున్నారు. హైదరాబాద్ సికింద్రాబాద్ హైటెక్ సిటీ భారత్ ఫీచర్ సిటీ నాల్గోనగరంగా పేరు రాబోతున్న నగరానికి బఫర్ జోన్ ఏరియాలో పేరుతో రియల్ వ్యాపారులలో గుబులు మొదలైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఫ్యూచర్ సిటీలో 22,000 ఎకరాల భూమిని సేకరించిన విషయం అందరికీ తెలిసిందే. ఫార్మసిటీ నిర్మాణ క్రమంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మసిటీ నుండి మూడు కిలోమీటర్ల వరకు బఫర్ జోన్ ఏర్పాటు చేస్తారని వినికిడి ఉండేదని నేడు సమస్య తీరడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయాన్ని వెల్లడిస్తే రియల్ వ్యాపారం భవిష్యత్తు బాగుంటుందని లేదంటే మందగిస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాల యాజమాన్యంపై విద్యార్థిసంఘాల ఆందోళన



విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**జిల్లెడు చౌదరిగూడ, జులై 25, ప్రభాతవార్త:**

జిల్లెడుచౌదరిగూడ మండలకేంద్రంలోని ఓ ప్రైవేటుపాఠశాల యాజమాన్యంపై శనివారం విద్యార్థిసంఘాల నాయకులు ఆందోళనకుదిగారు. పాఠశాల గుర్తింపును వెంటనే రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. గుర్తింపు లేకుండా చౌదరిగుడా మండలంలో నడుస్తున్నటువంటి ప్రైవేటు పాఠశాలలపై ఎంఈఓ, డీఈఓ స్పందించి గుర్తింపులను రద్దుచేయాలని వారు అన్నారు. మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో స్కూల్ బస్సు కిందపడి యూకేజీ విద్యార్థిని మృతిచెందిన ఘటనపై ఎస్ఎఫ్ఐ, ఏబివిపి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలముందు వారు ధర్నానిర్వహించి, పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం, బస్సుడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే అమాయకవిద్యార్థిని ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఘటనకు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మృతిచెందిన చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఇంటివద్ద చిన్నారిని దించిన తర్వాత డ్రైవర్‌బస్సు ను వెనక్కితీస్తున్న సమయంలో వాహనం వెనుక ఉన్న సహస్రను గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు, స్థానికులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆందోళన నిర్వహించిన ఎస్ఎఫ్ఐ, ఏబివిపి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అదిల్. రామ్ చరణ్, రేవంత్,లోకేష్,వంశీ, ప్రశాంత్, నబి తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరి క్షేత్రంలో వైభవంగా గీతా పారాయణం..

**–తొలి ఏకాదశి వేడుకల్లో ఆధ్యాత్మిక సేవ**

**వికారాబాద్, జులై 25, ప్రభాతవార్త:**

తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన అనంతగిరి అనంత పద్మనాభ స్వామి ఆలయ ఆవరణలో గీతా వాహిని ఆధ్వర్యంలో శనివారం గీతా పారాయణం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ ప్రముఖ్, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ కూర జయదేవ్ మాట్లాడుతూ, నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు భగవద్గీత చక్కటి పరిష్కార మార్గాన్ని చూపుతుందన్నారు. భగవద్గీత కేవలం ఒక పుస్తకం కాదని, దాని సారాంశాన్ని తెలుసుకున్న వారు జీవితంలో ఎదురవుతున్న అన్ని సమస్యలను సులువుగా అధిగమించగలరని తెలిపారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు భగవద్గీతను అనుసరిస్తున్నాయని పేర్కొన్న ఆయన, గీతావాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారాయణానికి తొలి రోజు పెద్ద ఎత్తున మహిళలు హాజరుకావడం విశేషమన్నారు. గీతా వాహిని అధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ, శనివారం ప్రారంభమైన ఈ గీతాపారాయణ కార్యక్రమం మరో ఎనిమిది రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గీతా వాహిని ఉపాధ్యక్షురాలు ఎం.లావణ్య, ప్రధాన కార్యదర్శి కె.జయశ్రీ, కమిటీ సభ్యులు కే. విజయ, స్వరూపక్క, ఎస్. మాధురి, ఝాన్సీ రాణి, వరలక్ష్మి, ఎం. స్వాతి, నీరజ, సరళ, సంజీవరాణి, సునీత, రజిత, లక్ష్మి, అపర్ణ, జోత్స్న, నాగరాణి, సరిత, స్వాతితో పాటు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్ రెడ్డి, నాయకులు అమరేందర్ రెడ్డి, నర్సిములు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుపై ఉమ్మడి నిరసన..

**–ఎమ్మెల్యే శంకర్ ద్వంద్వవైఖరి వీడాలని డిమాండ్**

**షాద్‌నగర్, జులై 25, ప్రభాతవార్త:**

షాద్‌నగర్ ప్రధాన కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని శాశ్వతంగా ప్రతిష్టించాలని కోరుతూ పలు రాజకీయ పార్టీలు, ప్రజా, కుల మరియు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆందోళన తీవ్రతరమైంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ద్వంద్వవైఖరి ఒలికిస్తున్నారని ఆ పార్టీల ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. ఎన్నికలకు ముందు అఖిలపక్ష సమావేశంలో అంబేద్కర్ విగ్రహాన్ని చౌరస్తాలో ప్రతిష్టిస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విస్మరించారని నాయకులు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో మార్పు వచ్చిందని, పరోక్షంగా విగ్రహ తొలగింపునకు కారణమవుతున్నారని దుయ్యబట్టారు. ట్రాఫిక్ సమస్యలకు అంబేద్కర్ విగ్రహం కారణం కాదని, ప్రభుత్వ స్థలాలు మరియు రహదారులను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. ముందుగా ఆ అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆతర్వాత చౌరస్తాను శాస్త్రీయంగా అభివృద్ధి చేయాలని డిమాండ్‌చేశారు. నాయకుల హెచ్చరిక అంబేద్కర్ విగ్రహం జోలికి వస్తే లేదా తొలగించడానికి ప్రయత్నిస్తే ప్రజలు సహించబోరని, దీనికి కాంగ్రెస్ పార్టీ మరియు స్థానిక ఎమ్మెల్యే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా స్వామ్యబద్ధంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ ఉమ్మడి నిరసన కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ), సీపీఎం, సీపీఐ, ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్, మాల మహానాడు, ఎస్సీ ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం

**–ఆర్బిఓఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 25, ప్రభాతవార్త:**

విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందజేస్తామని ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం తాండూరులో ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందజేయడం అభినందనీయమని కొనియాడారు. పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో భోదన చేపడుతున్న పాఠశాలలు చాలా ఉన్నాయని అన్నారు. విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్న కార్పొరేట్ సంస్థలకు ధీటుగా నిలబడి, ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి నిలదొక్కుకోవడం గర్వంగా ఉందని బిఎస్‌ఆర్ యాజమాన్యాలను కొనియాడారు.ప్రయివేట్ అసోసియేషన్ కు అండగా ఉంటూ, వ్యక్తిగతంగా సహకారం అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన మోహన్ కృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కార్యవర్గంలో సునీత, రాములు, రమేష్ గౌడ్, కీర్తి శర్మ అబ్దుల్ వహిద్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాలరెడ్డి, సంఘం స్టేట్ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, జిల్లా నేతలు నాగయ్య, వెంకట్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగోదాదేవిరంగనాథస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 25, ప్రభాతవార్త:**

పోచారం డివిజన్ యంనంపేట్‌లోని శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి ఆలయాన్ని కాంగ్రెస్ నాయకులు తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శనివారం సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ స్వామి వారి దివ్యదర్శనం చేసుకుని ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని దేవుణ్ని కోరుకున్నట్లు తెలిపారు. ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేసిన వారిలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ నర్రి శ్రీశైలం, బీఎన్. రెడ్డి, సహదేవ్ గౌడ్, బాస్కర్ యాదవ్, పి. పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడికి చికిత్స

**–మాజీ జడ్‌పిటిసి పరమార్శ**

**దోమ, జులై 25, ప్రభాతవార్త:**

దోమ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోసునం నరేందర్‌రెడ్డికి కాళ్ళ నరాలువాపుతో బాద పడేవారు హైద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స జరుపుకొని ఇంటికి చేరుకోగ శనివారం దోమ మండల మాజి జడ్‌పిటిసి నాగిరెడ్డితోపాటు దోమ మాజిసర్పంచ్ రాజిరెడ్డి, మండల బిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు గోపాల్‌గౌడ్, రాకొండ సర్పంచ్ ముచ్చందర్ రెడ్డి, మాజి కోఆప్షన్ సభ్యులు ఖాజపాషాలు కార్యకర్తలు ఇంటికి వెళ్ళి నరేందర్‌రెడ్డిని ఆరోగ్య వివరాలు తెలుసుకొన్నారు.అనంతరం మండల పరిదిలోని ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన దోమ పాల సంఘం మాజి అధ్యక్షులు గోపాల్‌గారి శ్రీనివాస్,తిరుపతిల మాతృమూర్తి కిష్టమ్మ అకాల మరణం చెందడముతో వారి ఇంటికి వెళ్ళి పార్థివదేహానికి పూలమాలలు వేసి కుటుంబసభ్యులను పరమార్శించారు.ఈ కార్యక్రమములో సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి,మైనోద్దీన్,సిద్దు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన ఎక్సైజ్ సూపర్‌డెంట్ శ్రీనివాస్‌రెడ్డి

**పరిగి టౌన్, జులై 25, ప్రభాతవార్త:**

పరిగి ఎమ్మెల్యేని అప్కారి సూపర్‌డెంట్ శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పరిగి నియోజకవర్గంలో పూర్తిగా గుడుంబా ను అరికట్టాలి అదేవిధంగా డ్రగ్స్ కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ రేట్లు అమ్మాలని సూచించారు గ్రామాలలో బెల్ట్ షాపులను అరికట్టాలని తెలియజేశారు.

## అశృనయనాల మధ్య పట్నం రుక్కమ్మ అంత్యక్రియలు

**–పట్నం బ్రదర్స్‌ను పరామర్శించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు**

**షాబాద్, జులై 25, ప్రభాతవార్త:**

శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాతృమూర్తి పట్నం రుక్కమ్మ (35) పార్థివదేహాన్ని షాబాద్ లో మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచగా మాజీ మంత్రులు పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఏ.చంద్రశేఖర్, ఏ.పి మాజీ మంత్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మెతుకు ఆనంద్, సుధీర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, రాజేందర్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కొప్పుల మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితారెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపలి చంద్రశేఖర్, మాజీ కార్పోరేషన్ చైర్మెన్లు వెంకటేశ్వర్ రెడ్డి, నాగేందర్ గౌడ్, బైండ్ల విజయకుమార్, మాజీ జడ్పీటీసీలు షరీఫ్, మైపాల్, కొండల్ రెడ్డి, సత్యానారాయణరెడ్డి, శ్రీరాంరెడ్డి, నాయకులు కార్తీక్ రెడ్డి, దేశమోళ్ల ఆంజనేయులు, చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి, తహసీల్దార్ అన్వర్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. షాబాద్ లోని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి గృహం నుండి ప్రారంభమైన యాత్ర గొల్లూరుగూడ వరకు సాగాయి.అందరూ పెద్దమ్మగా పిలిచే రుక్కమ్మ మరణ వార్త తెలయడంతో గొల్లూరూడతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో శోకసంద్రమైంది. రుక్కమ్మ అంత్యక్రియల్లో వందలాది మంది చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**షాబాద్, జులై 25, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరికి హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని చందన్వెళ్లిలో సర్పంచ్ చేవెళ్ల నవనీతస్వామి ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హారజౌ మాట్లాడారు. గ్రామ ప్రజలు, యువతలో న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రజలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్గిఉం డాలన్నారు. అలాగే ఆరోగ్యకరమైన జీవన విధానానికి ప్రాధాన్యం ఇస్తూ రసాయనాలు వినియోగించకుండా సంప్రదాయ పద్దతుల్లో పండించిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. సీనియర్ సివిల్‌జడ్జి దశరథరామయ్య మాట్లాడుతూ, వివిధ చట్టాలు, వాటి ప్రయోజనాలు, ప్రజలు పొందగల న్యాయపరమైన రక్షణ గురించి వివరించారు. పలువురు న్యాయవాదులు గ్రామస్తుల సందేహాలకు సమాదానాలు ఇస్తూ. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మల్లేష్ యాదవ్, సీనియర్ న్యాయవాది బాలకృష్ణ, మాజీ సర్పంచ్ నర్సింహారావు, ఉపసర్పంచ్ శ్రీశైలం, వార్డు మెంబర్లు వెంకటేష్, రమేష్, శిరీషరాఘవచారి, రామస్వామిగౌడ్, కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్దులు విద్యాభివృద్ధికి కృషి చేయాలి

**–సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య**

**కొడంగల్, జులై 25, ప్రభాతవార్త:**

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్దులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని అప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న కొత్త నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్దులకు కొత్తషూస్‌ను శనివారం విద్యార్దులకు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని అందులోభాగంగా విద్యార్దులకు ఉదయం టిఫిన్, సన్నబియ్యం అన్నంతోపాటు ఉచితంగా పుస్తకాలు అందించడం జరుగుతుందని, ఇందుకుగాను విద్యార్దులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధిలో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పకీరప్ప,గ్రామపంచాయతీ సెక్రటరీ శేఖర్, వార్డుసభ్యులు శ్యామల గోకుల్‌సింగ్, బందెయ్యగౌడ్, రాములు, తారాబాయి, రాంజీనాయక్, పాఠశాల ప్రధానోపాద్యాయులు విష్ణువర్దన్, చంద్రకాంత్, అంజిలతో పాటు విద్యార్దులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**–చెక్కులు అందించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, జులై 25, ప్రభాతవార్త:**

షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల చెక్కులను షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఫరూఖ్ నగర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 29మంది, షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 46మంది లబ్ధిదారులకు మొత్తం రూ.75,83,700 విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, తహసీల్దార్ నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ కొప్పునూరి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఘనంగా తొలి ఏకాదశి



స్వామివారికి హారతి ఇస్తున్న వేద పండితులు

**కీసర, జులై 25, ప్రభాతవార్త:**
భక్తుల కొంగుబంగారంలా భావించే చీర్యాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగానిర్వహించారు. స్వామివారికి ఉదయం పంచామృత నవకలశాభిషేకం ఆలయచైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ చేతులమీదుగా తులసి లక్షపుష్పార్చన సప్తహారతులు నిర్వహించడం జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లారపు హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**హేమాద్రి వెంకటేశ్వర ఆలయంలో...**
ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లిదాయర గ్రామంలోని శ్రీహేమాద్రి వేంకటేశ్వరస్వామి తొలి ఏకాదశి మహోత్సవం శనివారం ఆలయప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో విజయవంతంగా నిర్వహించారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు, భజన కార్యక్రమాల్లో పాల్గొని దివ్య తీర్థప్రసాదాలను స్వీకరించి శ్రీనివాసుని కృపాకటాక్షాలను పొందారు. తొలి ఏకాదశి సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామివారి అనంత కరుణాకటాక్షాలు సమస్త భక్తులపై ప్రసరించి ప్రతికుటుంబంలో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు, ధనధాన్య సమృద్ధి, సర్వమంగళాలు నిత్యం వెల్లివిరియాలని ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి ఆకాంక్షించారు. స్వామివారికి ఆలయచైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి దంపతులు హోమం నిర్వహించారు.

## శివారెడ్డిపల్లిలో లక్ష్యానికి చేరువలో ఎస్ఐఆర్



ఓటరు ప్రక్రియను పూర్తిచేస్తున్న అదికారులు

**దోమ, జులై 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని శివారెడ్డిపల్లిగ్రామంలో పర్గి ఎమ్మెల్యే టి.రాంమోహన్ రెడ్డి స్వగ్రామం ఓటరు నమోదు కార్యక్రమం సుమారుగా 95శాతం నమోదైంది. గ్రామంలో బిఎల్ఓ మోహన్ కృషితోపాటు గ్రామసర్పంచ్ కుమారుడు, మండలయువజనకాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి చొరవతో గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమం చేరువలో జరుగుతుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం మండలంలోని 36గ్రామపంచాయతీల్లో 44813మంది ఓటర్లు 45బూత్‌లు ఉండగా కొన్నిగ్రామాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం నిలకడగా జరుగుతుంది. ఈవిషయంపై మండల అదికారులు శనివారం తహసీల్దార్ రవిందర్, ఎంపిడిఓ గ్యామా సుడిగాలిపర్యటన చేశారు. ఓటరు సవరణలో మండలపరిధిలోని ఆయాగ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ, ఉపాధిహామీ, మహిళాసమాఖ్య, పంచాయతీకార్యదర్శులు, రెవెన్యూసిబ్బంది, అధికారులు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఓటరు సవరణ కార్యక్రమంలో ప్రజలు జులై 24 తేదిలోపు ఫాంలు అందించకపోతే ఓటర్‌లిస్టులో తమ పేరు ఉండేదికాదు. కాని ఇంకాచాలామంది ఎన్యూమరేషన్ ఫాంలు అందించకపోవడంతో ప్రభుత్వం మళ్ళీ ఆగస్టునెల వరకు పెంచడంతో అదికారులు, ప్రజలు ఊపిరిపీల్చుకొని ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జరుపుతున్నారు.

## ఉపాధ్యాయులకు గౌరవ వేతనం చెల్లించాలి
**టిఎస్ యుటిఎఫ్**

**దుద్యాల్, జులై 25, ప్రభాతవార్త:**
ప్రభుత్వ ఆదేశాల మేరకు సెన్సెస్ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రభుత్వం నిర్ణయించిన గౌరవ వేతనాన్ని వెంటనే చెల్లించడంతో పాటు, విధులు నిర్వహించిన మొత్తం కాలానికి సంబంధించిన అటెండెన్స్ సర్టిఫికెట్లు తక్షణమే మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. శనివారం బొంరాస్‌పేట్ తహసీల్దార్ పద్మజకు సంఘనాయకులు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రభుత్వ విధులను నిబద్ధతతో నిర్వహించినందున వారి న్యాయమైన హక్కులను పరిరక్షించేలా చర్యలుతీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్, జిల్లా కార్యదర్శి శివరాజ్, మండల ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి సర్దార్ పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



సంతకాలసేకరణ చేస్తున్న సిఐటియు మండలకార్యదర్శి నర్సింగ్‌రావు

**కీసర, జులై 25, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు మండల కార్యదర్శి బంగారు నర్సింగ్‌రావు డిమాండ్‌చేశారు. శనివారం మండల కమిటీ ఆద్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంపల్లి పారిశ్రామిక ప్రాంతం గత 25 సంవత్సరాలుగా అభివృద్దికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జులై 25నుండి ఆగస్టు 1వతేదీ వరకు సంతకాలసేకరణ ఉంటుందన్నారు. సరుకు రవాణా భారీ వాహనాల మూలంగా రోడ్లన్ని గంతలుపడి ఆధ్వాన్నంగా తయారైందన్నారు.

**చిన్న వానకే చెరువులను తలపిస్తున్న రోడ్డు...**
వర్షాకాలంలో రోడ్లన్ని గుంతలుపడి అస్తవ్యస్తంగా తయారైందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఓపెన్ నాళాలు, డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోవడం లేదన్నారు. స్ట్రీట్‌లైట్లు ఏర్పాటుచేసి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశ్రామికవాడను అభివృద్ధిచేయడానికి కృషి చేయాలని కార్యక్రమంలో నాయకులు చింతకింది అశోక్ పాల్గొన్నారు.

## బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**దుద్యాల్, జులై 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని చిల్ముల్‌మైలారంలోగల కొడంగల్ బాయ్స్-1 తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నాన్‌మైనారిటీ విద్యార్థుల కోసం ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్‌సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవేందర్ తెలిపారు. లక్కీడిప్ ద్వారా ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఐదోతరగతిలో ఎస్సీ-1, ఎస్టీ-1, ఆరో తరగతిలో ఎస్సీ-1, బీసీ-1, ఏడో తరగతిలో బీసీ-1, తొమ్మిదో తరగతిలో ఎస్సీ-1, ఓసీ-1 చొప్పున ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు జులై 27న ఉదయం 11.30 గంటలకు ఆధార్‌కార్డు, ఫోటోలు, బోనాఫైడ్, ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలతో చిల్ముల్ మైల్వార్‌లోని టీజీఎంఆర్ఎస్ కొడంగల్ బాయ్స్-1 పాఠశాలలో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 96769 27579, 94934 49755, 99497 64208 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# సర్‌ను అర్హులైనవారంతా సద్వినియోగం చేసుకోవాలి

**-కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి**



కార్యక్రమంలో మాట్లాడుతున్న అభిషేక్‌రెడ్డి

**యాచారం, జులై 25, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఓటర్ సమగ్ర సవరణ జాబితాలో నమోదు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగంచేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. యాచారంమండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో మండలంలోని 59 బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం నిర్వహించడం శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్ రెడ్డి ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమానికి ఇన్చార్జ్ కృష్ణచైతన్యరెడ్డితోకలిసి పాల్గొని, దిశానిర్దేశం చేశారు. కృష్ణచైతన్యరెడ్డి, అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరుజాబితా అత్యంత కీలకమైనది. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో ఉండేలాచూడడం, తప్పులను సరిచేయడం, కొత్త ఓటర్ల నమోదు, మార్పులుచేర్పులు, తొలగింపులపై పూర్తి అవగాహనకలిగి బాధ్యతాయుతంగా పనిచేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, బిఎల్ఏల విధులు, బూత్‌వారీ కార్యాచరణ, ఓటరుజాబితా పరిశీలన, ప్రజలకు అందించాల్సిన సహాయం, ఎన్నికల సన్నద్ధతపై సమగ్రంగా చర్చించారు. బలమైన బూత్‌లే కాంగ్రెస్ విజయానికి పునాది అన్నారు. ప్రతి ఓటరును చేరుకుందాం-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అని అన్నారు. బిఎల్ఏలు తమ బూత్‌లో ఉన్న ప్రతి ఇంటికి మూడుసార్లు తిరిగి ఏ ఒక్క ఓటర్ కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ బిఎల్ఓలు చిత్తశుద్ధితో పనిచేసే రాబోవు ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల్లో భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడానికి ప్రతి బిఎల్ఏ ప్రతి ఓటరును తట్టాల్సినబాధ్యత ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, డిసిసి ఉపాధ్యక్షులు ముత్యాల వెంకట్‌రెడ్డి, నాయకులు బిలకంటి శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌ల్ అచ్చన మంగాజంగయ్య, కేశమోని రాజు, సంగెం చైతన్యరాజ్, మస్కు అనితశరణం, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణయాదవ్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గొరిగే హరికిషన్, మండల అధ్యక్షులు పాశం జయప్రకాష్, మాజీ ఎంపిటిసిలు లక్ష్మీ మపతిగౌడ్, భారత మ్మ ఈశ్వర్, సూపర్వైజర్లు చీర శేఖర్, కోరే జగ దీష్‌రావు, నాయిని శ్రీకాంత్, వివిధగ్రామాల అధ్య క్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి



ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ రికార్డులు తనిఖీ చేస్తున్న ఏసిపి జానకిరెడ్డి

**ఆమనగల్లు, జులై 25, ప్రభాతవార్త:**
నమోదైనకేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు పోలీసులు మరింత అంకితభావంతో పనిచేయాలని ఏసిపి జానకిరెడ్డి అన్నారు. సత్వర పరిష్కారానికి ఇన్వెస్టిగేషన్ ప్రక్రియను వేగవంతంగా ముందుకు తీసుకపోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను ఏసిపి జానకిరెడ్డి శనివారం సందర్శించారు. ఈసంధర్బంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు విషయాలను ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు ఏసిపి పలు అంశాలను లేవనెత్తి వాటిపరిష్కారానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. కాగా విజిబుల్ పోలీసింగ్, రోడ్డుప్రమాదాలను నియంత్రించడం, ప్రజాభద్రతపై భరోసా, సిసిటిఎన్ఎస్ వినియోగం, ఆధునిక సాంకేతిక వినియోగం, ఫిర్యాదుదారుడి విశ్వాసం వంటి వాటిపై సలహాలు అందించారు. పెట్రోలింగ్ పగడ్బందీగా చేపట్టాలని సూచించారు.

## సర్‌పై అవగాహన అభినందనీయం
**-సర్పంచ్ చంద్రభూపాల్‌రావు**



సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

**కుల్కచర్ల, జులై 25, ప్రభాతవార్త:**
వెబ్ సిరిస్ సంస్థ సర్‌పై అవగాహన చేయడం అభినందనీయమని సర్పంచ్ చంద్రభూపాల్‌రావు అన్నారు. శనివారం మండలపరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో గ్రామ ప్రజలు వెబ్ సిరిస్ సంస్థ వారు సర్పంచ్ చంద్రభూపాల్ రావుతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన్న సర్ ప్రక్రియను ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులకు ఫామ్‌నింపి అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో వార్డుసభ్యులు భాస్కర్, బాలకృష్ణ, సీనియర్ నాయకులు రాములు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి పోరాటానికి ఘనవిజయం
**- కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి**

**కేశంపేట, జులై 25, ప్రభాతవార్త:**
ప్రజాసమస్యలను ప్రారంభం నుంచే చర్చల ద్వారా పరిష్కరించి ఉంటే దేశవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, ఆందోళనలు నివారించేవని కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజలగొంతును అణచివేయడం, నిరసనలను నిర్లక్ష్యంచేయడం కంటే సంభాషణ ద్వారా సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాస్వామ్యస్ఫూర్తికి నిదర్శనమని ఆమె తెలిపారు. ఆలస్యమైనా కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చి సీజేపీతో ఒప్పందానికి రావడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఒప్పందంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో, నిర్దిష్ట కాలవ్యవధిలో అమలు చేయాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని ఆమె స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతంచేయాలంటే ప్రజలగొంతును వినడం, చర్చలకు ప్రాధాన్యం ఇవ్వడం, రాజ్యాంగస్ఫూర్తిని గౌరవించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పందంలో ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి కోరారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 25, ప్రభాతవార్త:**
పోచారం డివిజన్ యంనంపేట్‌లో శనివారం కాంగ్రెస్ నాయకులు పర్యటించి సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ గ్రామంలో పర్యటించి మాట్లాడుతూ అర్హులైన వారు ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతం చేయాలి



ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి, తదితరులు

**పరిగిటౌన్, జులై 25, ప్రభాతవార్త:**
ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి పరిగి పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పరిగిపట్టణంలోని బూత్‌నెంబర్ 214,215లలో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంచేయాలని అదే విధంగా నిజమైన ఓటరు నష్టపోకుండా చూడాలని బిఎల్ఓలకు సూచించారు. అదేవిధంగా ఆగస్టు 3 వరకు వేచి చూడకుండా సత్వరమే ఎస్ఐఆర్‌ను పూర్తి చేసుకోవాలని చివరి నిమిషంలో ఇబ్బంది పడకుండా ఎన్యుమరేషన్ ఫారం నింపి బిఎల్ఓలకు ఇవ్వవలసిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 13వ వార్డు ఇన్చార్జి అన్వర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మాజీద్, బిఎల్ఏ అఫ్రోజ్, బిఎల్ఓ లు నుస్రత్, నర్సమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ విద్యుత్ కార్మికుడికి ప్రమాదం
**-ఆసుపత్రిలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, కమిషనర్‌ల పరామర్శ**

**షాద్‌నగర్, జులై 25, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ మున్సిపల్ విద్యుత్‌కార్మికుడు భూషణ్‌లింగం శనివారం ప్రమాదానికి గురయ్యాడు. ఢిల్లీ వరల్డ్ పాఠశాల సమీపంలో విద్యుత్‌స్తంభంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి నిచ్చెన పైనుండి కిందపడ్డాడు. సమీపంలోని స్థానిక ఐదవవార్డ్ కౌన్సిలర్ రాజునాయక్ ఉండడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన కార్మికుడు భూషణ్‌లింగంకు వెంటనే సిపిఆర్ చేశారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తోటి మున్సిపల్‌సిబ్బంది, అధికారులు చేరుకుని అతన్ని తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్‌చైర్మన్ అందేమోహన్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, కౌన్సిలర్ రాజునాయక్ తదితరులు హుటాహుటిన చేరుకుని లింగం ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. మెరుగైన చికిత్స కోసం మున్సిపల్ వైస్‌చైర్మన్ అందె మోహన్ శంషాబాద్ లిమ్స్ ఆసుపత్రికి లింగంను అంబులెన్స్‌లో తరలించారు. లింగం మున్సిపాలిటీలో విద్యుత్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధినిర్వహణలో పనిచేస్తున్న సందర్భంగా షాక్‌తగిలి ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి తెలిపారు. కార్మికుడిని కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖదీర్ అదేవిధంగా మున్సిపల్ ఉద్యోగులు ఇలియాస్ తదితరులు పరామర్శించారు.

## ఈర్లపల్లి రమేష్‌కు డా.సినారె పురస్కారం

**దుద్యాల్, జులై 25, ప్రభాతవార్త:**
దుద్యాల్ మండలం లగచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు ఈర్లపల్లి రమేష్‌కు ప్రతిష్ఠాత్మక డా.సి.నారాయణరెడ్డి పురస్కారం వరించింది. సాహితీసేవా కళాసమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నారు. రంగస్థల నాటకాలు, జానపద కళారూపాలు, సినీ రంగంలో ఆయన అందించిన విశిష్టసేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. దుద్యాల మండలానికి చెందిన కళాకారుడికి ఈ అరుదైనగౌరవం దక్కడంపై స్థానిక కళాకారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తంచేస్తూ రమేష్‌కు అభినందనలు తెలిపారు.

## ఎస్‌జిటి ఉపాధ్యాయుల శిక్షణ పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి చంద్రప్ప

**కోట్‌పల్లి, జులై 25, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలంలో నిర్వహించిన మూడు రోజుల పాటు ఎస్‌జిటి ఉపాధ్యాయులకు శిక్షణకార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా నిర్వహించిన ముగింపుసమావేశంలో మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ, ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతిగదిలో సమర్థవంతంగా అమలుచేసి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరచాలన్నారు. ఈ శిక్షణలో ఎఫ్ఎల్ఎన్‌పై సమగ్ర అవగాహన కల్పించడంతోపాటు, విద్యార్థులను పాఠశాలకు ఆకర్షించే వినూత్న పద్ధతులు, తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం తదితర అంశాలపై విస్తృతంగా శిక్షణ అందివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లుగా దివాకర్‌శాస్త్రి, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, అమూల్య, శ్వేత, ముత్యంరెడ్డి, శ్రీనివాస్, లావణ్య, శ్రీదేవి, యాదయ్య, నాగమణి, సునీత, శివలక్ష్మి, జయశ్రీ, సిఆర్పీ నర్సిములు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజల్లో తహసీల్దార్

**కోట్‌పల్లి, జులై 25, ప్రభాతవార్త:**
ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలకేంద్రంలోని శివాలయంలో తహసీల్దార్ ఆనంద్‌రావు దర్శించుకొని ప్రత్యేకపూజలుచేశారు. ఈసందర్భంగా దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని రాష్ట్రప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ప్రార్థించారు. ముక్కోటి ఏకాదశి హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన పర్వదినమని, ఆధ్యాత్మికచింతనతో పాటు ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రతి ఒక్కరికీ శుభ్రప్రదమని పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో రవిందర్‌గౌడ్, సదానందం, కోమటి రవీందర్, తమ్మలి రమేష్, శ్రీశైలం స్వామి, గుజ్జరి నర్సిములు, పన్నెకారి భాస్కర్, కమ్మరి వీర బ్రహ్మం, సరళదేవి, మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఫామ్‌ను నింపాల్సిందే
**-సర్పంచ్ రవిందర్‌నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

**కుల్కచర్ల, జులై 25, ప్రభాతవార్త:**
ఓటుహక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా సర్‌ఫామ్‌ను నింపాల్సిందేనన్ని సర్పంచ్ రవిందర్‌నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఘణపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక నాయకులతోకలిసి సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా సర్పంచ్ రవిందర్‌నాయక్ మాట్లాడుతూ దూరప్రాంతాలలో ఉన్న ప్రజలు సమయం తీసుకుని ప్రభుత్వం చేపట్టిన సర్ ప్రక్రియలో పాల్గొని ఫామ్‌ను నింపి అప్పజేప్పలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గ్రామనాయకులు పాల్గొన్నారు.

## మండల ఉపసర్పంచ్‌ల సంఘం నూతన కమిటీ



శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్

**మోమిన్‌పేట్, జులై 25, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లా ఉపసర్పంచ్‌లసంఘం అధ్యక్షులు ఎస్.గోపాల్ ఆధ్వర్యంలో ఉపసర్పంచ్‌లసంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు లావుడియా రాములు నాయక్‌ఆదేశాల మేరకు మండల ఉపసర్పంచ్‌లసంఘం నూతన కమిటీని ఏర్పాటుచేశారు. ఈసందర్బంగా జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపసర్పంచ్‌లసంఘం మండల అధ్యక్షులుగా.. ఆర్.మహేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా కె.రంచెంద్రిని, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అస్లాంను, ఉపాధ్యక్షులుగా కొర్ర రామునాయక్‌ను, ప్రకాష్, మల్లేశంలను, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సరోజవెంకటేష్, బాలకృష్ణలను, కోశాధికారిగా రమేష్, ఉమ్మడికార్యదర్శులుగా వెంకటేష్, ఎం.ఈశ్వరిని, ముఖ్య పలహాదారులుగా వద్యా సీతారాంనాయక, సౌకత్ అలి, కార్యవర్గసభ్యులు ఈకార్యక్రమంలో ఉపసర్పంచుల బాడీ సభ్యులు పాల్గొనడం జరిగింది. వీరందరిని నియమిస్తూ వారికికూడా నియామకపత్రాలను అందజేశారు.

## బిఆర్ఎస్‌లో చేరిన మొరంగపల్లి నాయకులు



బిఆర్ఎస్‌లో చేరినవారికి పార్టీ కండువా వేసిన మెతుకు ఆనంద్

**మోమిన్‌పేట్, జులై 25, ప్రభాతవార్త:**
మోమిన్‌పేట్‌మండలం మొరంగపల్లి గ్రామానికిచెందిన పలువురు నాయకులు వికారాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో వనివారం పార్టీలో చేరారు. మొరంగపల్లి గ్రామానికి చెందిన 8వ వార్డుసభ్యులు తలారి రాజేష్ తన అనుచరులు శ్రీనివాస్, అక్షయ్, ఈశ్వర్, పవన్‌కుమార్, ప్రశాంత్, సామెల్‌లతో కలిసి మెతుకు ఆనంద్ ఆద్వర్యంలో చేరారు. ఈచేరికతో మొరంగపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతంకానుందని అధ్యక్షులు అన్నారు. కార్యక్రమంలో సాయమొల్ల బిచ్చయ్య, కంతి నర్సింలు, పీ.మల్లారెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, డీ.నర్సింలు, టీ.మహిపాల్, సురేష్, కావలి వెంకటయ్య గ్రామపెద్దలు, యువకులు తదితరులు పార్టీలోచేరారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్ స్వచ్ఛందంగా పార్టీలోకిచేరినవారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## పాస్టర్ పీటర్‌కు సౌండ్ బాక్స్ బహూకరణ

**షాద్‌నగర్, జులై 25, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ నియోజకవర్గ మైనారిటీ కోఆప్షన్ సభ్యురాలు సహోదరి ఉషారాణి గారి కుమారుడు సహోదరుడు రవితేజ, న్యూ అపోస్తల చర్చి పాస్టర్ పాస్టర్ పీటర్‌కు సౌండ్ బాక్స్‌ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ చింపోడ్ దేవదాస్, సెక్రటరీ పాస్టర్ వై.ఆశీర్వాదం, ట్రెజరర్ పాస్టర్ వై.మురళీకృష్ణలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సౌండ్ బాక్స్‌ను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ముందు రైతుల ఆందోళన





సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

**యాచారం, జులై 25, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ప్రభుత్వ అసైన్డ్ భూముల సేకరణ, సర్వే ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు, రైతులు కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ.. మొండి గౌరెల్లి పరిధిలోని సర్వే నెంబర్లు 19, 68, 127 లలో గల అసైన్డ్ భూములను పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరిస్తామని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, దీనికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు 677 ఎకరాలకు సర్వే కూడా పూర్తి చేశారని తెలిపారు. అయితే, తరతరాలుగా ఈ భూములను నమ్ముకుని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్న రైతులకు భూపరిహారం పెంచే విషయంలో అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వడంలేదని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిశ్రమల పేరుతో ఉన్న భూములు లాక్కుంటే పేద రైతులు ఎలా బతకాలని, ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమిని నమ్ముకుని వాస్తవంగా కబ్జాలో ఉన్న రైతులకు న్యాయం చేయాలని, పరిహారం కోసం చొరబడిన నకిలీలబ్ధిదారులను తక్షణమే ఏరివేయాలని కోరారు. రైతులకు ఇచ్చినహామీలను నెరవేర్చకుండా, నకిలీలను ఏరివేయకుండా అధికారులు ఏకపక్షంగా ముందుకు వెళ్లడం సరికాదన్నారు. భూనష్టపరిహారంపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనిరసన ధర్నా కార్యక్రమంలో స్థానిక నాయకులు మర్రిపల్లి అంజయ్యయాదవ్, తాండ్ర రవి, బండి మీద కృష్ణమాదిగ, మొండిగౌరెల్లి గ్రామరైతులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.